క్లుప్తంగా

మార్కెట్ పనులు పూర్తిచేయాలి

మాజీ కౌన్సిలర్ రవినాయక్

తుక్కుగూడ: మున్సిపాలిటీలో నిర్మించే సమీకృత మార్కెట్‌కు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని 10వ వార్డు మాజీ కౌన్సిలర్ బాదావత్ రవినాయక్ కోరారు. సోమవారం పుర కేంద్రంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.4 కోట్లకు పైగా నిధులు ఖర్చు చేసి నిర్మించిన మార్కెట్ నిధులు సరిపడకపోవడంతో భవనం అసంపూర్తిగా మిగిలిపోయిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు మంజూరు చేసి, మున్సిపాలిటీ అభివృద్ధి ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలి

బడంగ్‌పేట్: అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలని ఇండియా యునైటెడ్ సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బొద్రమోని పురుషోత్తం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వలేదని, ప్రస్తుత సర్కార్ కార్డుల జారీలో తీవ్ర జాప్యం చేస్తుందని ఆరోపించారు. రేషన్‌కార్డు లేని వారందరూ ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకొని ఏడాదిన్నర అవుతున్నా.. నేటికీ దర్యాప్తు పూర్తి చేయలేదని విమర్శించారు. అన్ని రుణాలకు, ప్రభుత్వ పరంగా వచ్చే పథకాలకు రేషన్‌కార్డు ముడిపెట్టడంతో అర్హులందరూ దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. రేషన్ కార్డు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వారి ఇబ్బందిని గమనించి వెంటనే కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కందుకూరు: మండలంలోని మీర్‌ఖాన్‌పేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వేణుగోపాల్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ టౌన్ ఫీడర్ పరిధిలో నూతన విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నందున ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రిజర్వేషన్లు అమలు చేయాలి

మీర్‌పేట: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలని మీర్‌పేట మాజీ కార్పొరేటర్ సిద్దాల బీరప్ప ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా బీసీ రిజర్వేషన్‌లు అమలు చేసిన తర్వాతే పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఓజోన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వర్క్‌షాప్



వర్క్‌షాపులో పాల్గొన్న వైద్య నిపుణులు

దిల్‌సుఖ్‌నగర్: మహిళా ఆరోగ్యంపై దృష్టి సారిస్తూ ఆర్‌కేపురంలోని ఓజోన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఉటేరస్ హ్యాండ్స్ ఆన్ వర్క్‌షాపు విజయవంతంగా ముగిసింది. గైనకాలజిస్టులు, ల్యాప్రోస్కోపిక్ సర్జన్లు పాల్గొని అత్యాధునిక సాంకేతికతపై శిక్షణ పొందారు. ల్యాప్రోస్కోపిక్ అసిస్టెడ్ అల్ట్రాసౌండ్ గైడెడ్ మైక్రోవేవ్ అబ్లేషన్ ఉటేరస్‌లో ఫైబ్రాయిడ్స్ అడెనోమయోసిస్ ఉన్న మహిళలకు గర్భాశయాన్ని తొలగించకుండా చికిత్స చేసే సురక్షా ఫర్టిలిటీ సేవింగ్ టెక్నిక్ ఈ పద్ధతి ద్వారా అల్ట్రాసౌండ్ గైడెన్స్‌తో హైప్రిసిషన్ చికిత్స సాధ్యమవుతుందని వైద్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు శంకర్ నాయక్, పూజిత, పాల్గొన్నారు.

బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సాయి

సైదాబాద్: ఆషాఢమాస బోనాల మహోత్సవాలు పురస్కరించుకొని సైదాబాద్ పూసలబస్తీలో జై శ్రీ భవానీ ఫ్రెండ్స్ యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే అమ్మవారి ఘటాల ఊరేగింపునకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నామని నిర్వాహకుడు సాయి తెలిపారు. సోమవారం సైదాబాద్ డివిజన్ పూసలబస్తీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అసోషియేషన్ ప్రతినిధులతో కలిసి ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డప్పు చప్పుళ్లు, యువత కేరింతలు నృత్యాల నడుమ పోతరాజుల విన్యాసాలతో ఈ నెల 21న అమ్మవారి ఘటాల ఊరేగింపు ఉంటుందన్నారు.

వనితకు.. బీమా ధీమా

- ప్రమాదశాత్తు మరణిస్తే రూ.10 లక్షల పరిహారం
- ఆర్థికంగా చేయూతనిస్తున్న ప్రభుత్వం
- సమాఖ్య సభ్యుల్లో హర్షం



మహేశ్వరంలో మహిళా సంఘం సభ్యుల సమావేశం (ఫైల్)

మహేశ్వరం: మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. వారి ప్రమాద బీమాను 2029 వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో మహేశ్వరం మండలంలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రమాద సమయంలో భరోసా కల్పించినట్లయింది. అందులో సభ్యులుగా ఉన్నవారిలో ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షల బీమా పరిహారం పొందే సౌలభ్యం ఉంది.

మండలంలో 1089 సంఘాలు

మండలంలోని 1089 సమఖ్య మహిళా సంఘాలు ఉన్నాయి. అందులో 11,645 మంది సభ్యులు ఉన్నారు. వీరు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు పొందుతూ.. స్వయం ఉపాధి అవకాశాలు పెంపొందించుకుంటున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆయా యూనిట్లు, ఉపాధి అవకాశాలు నెలకొల్పి, ఉపాధి పొందుతున్నారు. ప్రమాద బీమాను పెంచుతూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బీమా పథకం స్త్రీ నిధి ద్వారా అమలు జరుగుతుందని స్పష్టం చేశారు. ఇటీవల మండలంలోని నలుగురు సభ్యులు ప్రమాదవశాత్తు మరణించగా, వారి వివరాలను ఉన్నతాధికారులకు పంపించామని మండల మహిళా సమాఖ్య అధికారి సత్యనారాయణ తెలిపారు. ఒక్కొక్కరికి త్వరలో రూ.10 లక్షల ప్రమాద బీమా డబ్బులు అందనున్నాయి.

సహజ మరణానికి..

మహిళలను మహారాణులను చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రత్యేకంగా వివిధ పథకాల రూపకల్పన చేస్తోంది. స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలతో పాటు స్త్రీనిధి రుణాలను అందిస్తూ వారు స్వశక్తితో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా ప్రోత్సహిస్తున్నారు. సంఘంలో సభ్యులకు ప్రత్యేకంగా రుణ, ప్రమాద బీమా పథకాలను ప్రవేశపెట్టింది. సభ్యులు ఎవరైనా సాధారణ, ప్రమాద బీమాలు అమలయ్యేలా చర్యలు చేపట్టింది. రుణ బీమా పథకంలో సహజ మరణం సంభవిస్తే రూ.2 లక్షలు, ప్రమాదవశాత్తు అయితే రూ.10 లక్షల వరకు అందించనుంది.

ఆర్థికంగా చేయూత

సంఘాల సభ్యుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రమాద బీమా పథకాన్ని మరో నాలుగేళ్ల పాటు పొడగించింది. సహాయక బృందాలు గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక స్వావలంబనకు, సామాజిక సాధికారతకు కీలకమైన వేదికలు. వీరి ద్వారా మహిళలు చిన్న తరహా వ్యాపారాలు ప్రారంభించుకోవడంతో పాటు, పొదుపును ప్రోత్సహిస్తున్నారు. తద్వారా తమ కుటుంబాలకు ఆర్థిక చేయూతనిస్తున్నారు. సంఘంలోని సభ్యులకు ఏవైనా అనుకోని సంఘటనలు ఎదురైతే వారి కుటుంబాల భవిష్యత్తును చీకటిమయం చేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆ కుటుంబాలకు అండగా ఉండేందుకు బీమాను తెచ్చింది.

రుణమాఫీ

సంఘం సభ్యురాలు ప్రమాదవశాత్తు మరణిస్తే ప్రభుత్వం అందించే రూ.10 లక్షలు నామినీ ఖాతాల్లో జమ చేస్తారు. వారికి సంబంధించిన రుణాన్ని మాఫీ చేస్తారు. 50 శాతం మించిన అంగవైకల్యం ఏర్పడితే సదరం ధృవపత్రం ద్వారా పరిశీలించి, రూ.5 లక్షలు అందజేయనున్నారు. ఈ పథకం ప్రారంభించక ముందు రుణం పొందినవారు మరణిస్తే, వడ్డీతో కలిపి చెల్లించాల్సిన బాధ్యత కుటుంబీకులు, సంఘం సభ్యులపై పడేది.

బీమాకు అర్హులు

జిల్లా గ్రామీణ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో 18 నుంచి 59 ఏళ్ల వారు స్వయం సహాయ సభ్యురాలిగా ఉన్నవారికి బీమా వర్తిస్తుంది. పథకాన్ని గతేడాది మార్చి 14 ప్రారంభించగా.. నాటి నుంచి మృతి చెందిన వారు అర్హులు. బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు తీసుకున్న వారు మరణిస్తే.. వారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుంటుంది.

సమాఖ్యలో చేరండి



అతివలు.. మహిళా సమాఖ్య సంఘంలో చేరండి. ప్రభుత్వం రుణాలు ఇచ్చి, వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తుంది. స్వశక్తితో ఎదిగేలా చేస్తుంది. సంఘం సభ్యుల్లో ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి రూ.10 లక్షల బీమా డబ్బులు అందజేస్తుంది. బాధిత కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలుస్తుంది.

– కె.సత్యనారాయణ, మహిళా సమఖ్య ఏపీఎం, మహేశ్వరం

నిరుపేదల సొంతింటి కల సాకారం

జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి



భూమిపూజ చేస్తున్న పాండురంగారెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు

కందుకూరు: నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని బాచుపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయన ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి ముగ్గు పోసి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాచుపల్లి గ్రామానికి ఇప్పటి వరకు 35 మంజూరయ్యాయన్నారు. అందులో 30 ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేదలకు రెండు పడక గదులు నిర్మించి ఇస్తామని చెప్పి, పదేళ్లలో మండలంలో ఒక్క ఇల్లు కూడా నిర్మించి ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అర్హత గల ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అవుతున్నాయని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు చెవులపల్లి కృష్ణ, ఉపాధ్యక్షుడు యాలాల రాఘవేందర్, ఇందిరమ్మ కమిటీ అధ్యక్షుడు మల్లగల విజయ్, సభ్యుడు అనేగొని నవీన్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పగడాల సుధాకర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కత్తుల శ్రీశైలం, మైనార్టీ సెల్ అధ్యక్షుడు జహంగీర్, నాయకులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని వినతి



తహసీల్దార్ గోపాల్‌కు వినతిపత్రం అందిస్తున్న జేఏసీ నాయకులు

కందుకూరు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ రైట్స్ రాజ్యాధికార సాధన జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ గోపాల్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ జేఏసీ డివిజన్ కన్వీనర్ గుండ్రపల్లి అమరేందర్, మండల కన్వీనర్ సీహెచ్ ఆంజనేయులు మాట్లాడారు. రాష్ట్రంలో దాదాపుగా 26 వేలకుపైగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో సుమారుగా 22 లక్షల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారన్నారు. అందులో 60 శాతం వరకు విద్యార్థులు తాము చదువుకుంటున్న పాఠశాలలకు దూరంగా నివాసం ఉంటున్నారన్నారు. ప్రతి రోజు వారందరూ పాఠశాలలకు వెళ్లాలంటే సరైన బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతి గ్రామానికి ఒక బస్సును ప్రత్యేకంగా ఏర్పాటు చేసి ఉచితంగా విద్యార్థులను పాఠశాలలకు తీసుకెళ్లి, మళ్లీ తీసుకొచ్చేలా ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో విద్యార్థులకు సమయం వృథా కాదని, చదువు పట్ల మరింత ఆసక్తి పెరుగుతుందన్నారు. వారి వెంట నాయీ బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు పి.రమేష్, ఆ జేఏసీ నాయకులు ఘట్టగల్ల హనోక్, గూడూరు భాస్కర్, జి.కృష్ణ, టి.బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత



విజేతలకు కప్ అందజేస్తున్న నిర్వాహకులు

బడంగ్‌పేట్: మున్సిపల్‌లోని బాలాపూర్‌లో భీమ్‌రావ్ ప్లేగ్రౌండ్ కమిటీ ఆధ్వర్యంలో బాలాపూర్ ప్రీమియర్ లీగ్ సీజన్–2 క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ పోటీలో ఏడు టీమ్‌లో పాల్గొనగా.. నెలరోజుల పాటు కొనసాగింది. ఫైనల్‌కు బాలాపూర్ హంటర్, బాలాపూర్ వారియర్స్ చేరుకొని పోటీపడగా బాలాపూర్ హంటర్ విజేతగా నిలిచింది. విజేతగా నిలిచిన టీమ్‌కు సోమవారం కంటెస్టెడ్ కార్పొరేటర్ తిమ్మని గిరీష్, బాల్‌నింగని జంగయ్య, కొప్పుల రాజు, వంగేటి అశ్విన్‌రెడ్డి, చిగురింత దయాకర్‌రెడ్డి, బొర్ర లక్ష్మణ్, బొర్ర దాస్, శివారెడ్డి కలిసి కప్‌తో పాటు నగదును అందజేశారు. కార్యక్రమంలో ప్లేగ్రౌండ్ కమిటీ సభ్యులు నర్సింగ్, శ్రీరాములు, టి.సురేష్, కె.ప్రవీణ్, ఏ.ప్రశాంత్, నాగరత్నం, పి.నరేశ్, కె.మధు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో బీసీలకు అన్యాయం

కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్



మాట్లాడుతున్న సుదర్శన్‌గౌడ్

కొత్తూరు: గత పదేళ్ల రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ పార్టీ హయాంలో బీసీలను అన్యాయం జరిగిందని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ అన్నారు. బీసీ రిజర్వేషన్లను కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతానికి పెంచుతూ కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవడంపై ఆయన సోమవారం పలువురు నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే పేదలు, మధ్యతరగతి ప్రజలు, రైతులు బాగుపడ్డట్లు గుర్తుచేశారు. గతంలో 33 శాతం ఉన్న బీసీల రిజర్వేషన్లను బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 22 శాతానికి కుదించినట్లు తెలిపారు. కాగా ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట మేరకు 42 శాతం రిజర్వేషన్లు ఖరారు చేసిందన్నారు. పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ రాష్ట్ర ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా బీసీ రిజర్వేషన్ల ప్రక్రియను విజయవంతంగా అమోదింపజేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. తీన్మార్ మల్లన్న కార్యాలయంపై జాగృతి నాయకుల దాడిని ఆయన ఖండించారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్‌ముదిరాజ్, అంబటి ప్రభాకర్, సత్తయ్య, నర్సింహ, నవీన్‌చారి, శివశంకర్‌గౌడ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బల్దియా కార్యాలయంలో పనిచేయని లిఫ్ట్

ఎల్‌బీనగర్: జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో లిఫ్ట్ పనిచేయకపోవడంతో దివ్యాంగులు వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు.మూండతస్తులో ఈ భవనంలో కింది అంతస్తులో సరూర్‌నగర్ , మొదటి అంతస్తులో ఎల్‌బీనగర్ , రెండో అంతస్తులో హయత్‌నగర్ సర్కిల్ కార్యాలయాలు ఉన్నాయి.ఈ భవనం సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో ఉండడంతో భవన నిర్వహణ వారే చూస్తున్నారు.వారి సర్కిల్ కార్యలయం కిందనే ఉండడంతో వారు లిఫ్ట్ విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణాలు వినిపిస్తున్నాయి.ఎల్‌బీనగర్, హయత్‌నగర్ సర్కిల్‌ల్లో వివిధ పనులకు వచ్చే వారు మెట్ల ద్వారా పైకి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

స్వచ్ఛత పాటించాలి



పనులను పరిశీలిస్తున్న నాయకులు

ఎల్‌బీనగర్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని ఎస్‌కేడీ నగర్‌లో నిర్వహించిన క్లీన్ ఎస్‌కేడీ నగర్ కార్యక్రమంలో పాల్గొన్నారు.కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు జేసీబీతో కాలనీలో పేరుకుపోయిన మట్టి కుప్పలు, చెట్ల కొమ్మలు, చెత్తను తొలగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలు శుభ్రంగా ఉంచుకోవడంతో దోమల వృద్ధి చెందవన్నారు. కార్యక్రమంలో అమరేంధర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సోమా రెడ్డి, వెంకటేశ్వరరావు, కృష్ణరావు, పాపారా వు, శ్రీనివాస్, తులసిరెడ్డి, రఘుమా రెడ్డి పాల్గొన్నారు.

చెత్త రిక్షాల అందజేత



రిక్షాలు పంపిణీ చేస్తున్న భాగ్యలక్ష్మి

మలక్‌పేట: పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం చేయరాదని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్ రెడ్డి సూచించారు. డివిజన్ పరిధిలోని శానిటేషన్ సిబ్బందితో కలిసి సఫాయి కార్మికులకు సోమవారం ఆమె చెత్త రిక్షాలు అందజేసి మాట్లాడారు. శుభ్రత విషయంలో రాజీపడొద్దని, సిబ్బందికి అవసరమైన పనిముట్లు సమకూర్చడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జవాన్ రాజు, ఎస్ఎఫ్ఏ గణేష్, శ్రీనివాస్, నర్సింగ్, ముజీబ్, శ్రీను, అక్షయ్ పాల్గొన్నారు.

ప్రజావాణిలో 15 ఫిర్యాదులు

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలోని సర్కిల్‌లలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 15 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు.కాప్రా సర్కిల్ 1, ఉప్పల్ సర్కిల్ 2, హయత్‌నగర్ సర్కిల్ 3, ఎల్‌బీనగర్ సర్కిల్ 1, సరూర్‌నగర్ సర్కిల్ 3, ఎల్‌బీనగర్ జోనల్‌లో 5 ఫిర్యాదులు అందాయన్నారు.

బీసీలను మభ్యపెడుతున్న కాంగ్రెస్

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్ ముదిరాజ్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కందుకూరు: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మభ్యపెట్టి మోసం చేసే పనిచేస్తోందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నె జయేందర్‌ముదిరాజ్, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్ విమర్శించారు. ఈ మేరకు పార్టీ నాయకులతో కలిసి మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చామని ప్రకటించుకుందని, ఆ మేర చట్టబద్ధత కల్పిస్తూ జీఓ జారీ చేస్తూ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. మాటిమాటికి ఢిల్లీ వెళ్లే సీఎం రేవంత్‌రెడ్డి బీసీల కోసం 42 శాతం రిజర్వేషన్ల విషయాన్ని ఒక్కసారైనా ప్రధాన మంత్రితో చర్చించారా అని ప్రశ్నించారు. 42 శాతం ఇవ్వాలంటే ఖచ్చితంగా పార్లమెంట్ ఆమోదం పొందాలన్నారు. ఆ విషయాలు తెలిసి కూడా జీఓకు విరుద్ధంగా కాంగ్రెస్ పార్టీ నుంచి 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామంటున్నారన్నారు. 42 శాతం జీఓ అమలు చేయకపోతే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు అందరూ ఏకమై కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు, మద్దతుదారులను చిత్తుగా ఓడిస్తారని హెచ్చరించారు. బీసీలను తప్పుదోవ పట్టిస్తూ గారడి మాటలతో మోసం చేస్తున్న ప్రభుత్వాన్ని బీసీ మేధావులు, నాయకులు, ప్రజలు ఐక్యతతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్‌లు దేరంగుల జంగయ్య, సదానంద్‌గౌడ్, పర్వతాలుయాదవ్, సీనియర్ నాయకులు అశోక్‌ముదిరాజ్, శ్రీహరిముదిరాజ్, యూత్ అధ్యక్షుడు తాళ్ల కార్తీక్, శంకరి తిరుపతి, కాసోజు ప్రశాంత్‌చారి, మన్నే నరేందర్‌ముదిరాజ్, శివలింగాచారి, మెరగు రాజుముదిరాజ్, కంద పెద్ద నర్సింహా, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

మల్లు రవికి నేతల శుభాకాంక్షలు



మల్లు రవికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కాంగ్రెస్ పార్టీ తెలంగాణ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, నాగర్‌కర్నూల్ ఎంపీ డా.మల్లు రవి జన్మదినం సందర్భంగా సోమవారం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో.. మాజీ మేయర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాత నర్సింహారెడ్డి తదితరులు ఎంపీకి శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి రమేశ్



పూజా కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొని మానసిక ప్రశాంతత పొందాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి బండారు రమేశ్ అన్నారు. ఆషాఢ మాసం సంకటహర చతుర్థిని పురస్కరించుకొని పట్టణంలోని వినాయక్ గంజ్ గణపతి దేవాలయంలో సాయిమిత్ర యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మలగారి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్‌తో కలిసి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు వన్నాడ వెంకటేశ్, శ్రీనివాస్‌గౌడ్, అభిలాష్, ప్రవీణ్, ప్రదీప్, కోటిలింగంగౌడ్, రాజేశ్వర్, గోపాల్, శ్రీధర్, ఆగీరు కృష్ణయ్య, శ్రీనివాస్, శేఖర్ రెడ్డి, గజవాడ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుకు మరమ్మతులు



గుంతలు పూడ్చి వేయిస్తున్న యువకులు, మాజీ ప్రజాప్రతినిధులు

మొయినాబాద్‌రూరల్: యువత స్వచ్ఛందంగా ముందుకొచ్చి అభివృద్ధి పనుల్లో భాగస్వాములు కావడం అభినందనీయమని చిన్నమంగళారం తాజా మాజీ సర్పంచ్ సుకన్యహరిశంకర్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని రెడ్డిపల్లి నుంచి చిన్నమంగళారం వరకు గుంతలుపడిన రోడ్డుకు యువకుడు విష్ణుగౌడ్ రూ.లక్ష సొంత డబ్బులతో మరమ్మతులు చేయించాడు. ఈ సందర్భంగా ఈ రోడ్డు పనులను మాజీ ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రెడ్డిపల్లి నుంచి చిన్నమంగళారం వరకు మూడు కిలోమీటర్ల మేర రోడ్డులో అడుగడుగునా గుంతలు పడడంతో ఆర్టీసీ బస్సు గ్రామానికి రాదని తెలపడంతో.. వెంటనే స్పందించిన విష్ణుగౌడ్ మరమ్మతులకు సహకరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ గోపాల్, శంకరయ్య, మోర శ్రీనివాస్, రాంచందర్, రాజు పాల్గొన్నారు.


సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు: ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని వింటేజ్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేస్తోందన్నారు. అధికారులు, పాలకవర్గాలు నిర్దిష్టమైన ప్రణాళికతో పనులు పూర్తి చేయాలని కోరారు. ముఖ్యంగా సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలను అధికారులు ఇబ్బందులకు గురిచేయొద్దని, సకాలంలో పరిష్కరించి ప్రభుత్వానికి, అధికారులకు గుర్తింపు వచ్చే విధంగా బాధ్యతలు నిర్వహించాలని సూచించారు. మున్సిపల్ పాలకవర్గం పట్టణ అభివృద్ధి కోసం మాస్టర్‌ప్లాన్ రూపొందించుకోవాలన్నారు. వార్డుల వారీగా అవసరం ఉన్న పనులు, ప్రాధాన్యత పనులు అందులో పొందుపర్చి వాటి పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. మున్సిపాలిటీని జిల్లాలోనే ఆదర్శంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని సూచించారు. పాలకవర్గానికి నిధుల సహకారంలో తనవంతు సాయం చేస్తానని వివరించారు. అనంతరం కాలనీలో విద్యుత్ సమస్య ఉందని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగానే సమస్య పరిష్కరించడంపై ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ, ఏడీ రవీందర్, ఏఈ రమేశ్‌గౌడ్, నాయకులు సుదర్శన్‌గౌడ్, సోమ్లానాయక్, దేవేందర్‌యాదవ్, యాదయ్య, శివశంకర్‌గౌడ్, జనార్దన్‌చారి, జగన్, సత్తయ్య, ప్రభాకర్, కాలనీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

నందిగామ: గ్రామాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని తాళ్లగూడలో హెచ్ఎండీఏ నిధులు రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న మురుగు కాల్వలు, రూ.25లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహాయాదవ్, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, నాయకులు కుమారస్వామిగౌడ్, చంద్రపాల్‌రెడ్డి, కొమ్ము కృష్ణ, సురేందర్, శ్రీశైలం, బుచ్చయ్య, కావలి కృష్ణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్